**వెళ్ళవలసిన బస్సు వచ్చేది ఎప్పుడో—ఈ లోపల అలసి విసిగిపోయే జీవితాలటుండనిస్తే,వెళ్ళవలసిన బస్సుకోసం జీవితాన్నించే వెళ్ళిపోవడం యెంతవిషాదం!**

# బస్సొచ్చింది

గంగుల నరసింహారెడ్డి

రాష్ట్ర రాజధానీ నగరంలో సమయం సాయంత్రం సరిగ్గా ఆరు గంటల ముప్ఫయి నిమిషాలు. చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ మలుపు, ఐస్ ఫ్యాక్టరీ దగ్గర రామ్నగర్ వైపు వెళ్ళే బస్సులు ఆగవలసివున్న బస్స్టాండు అది. అక్కడ కొందరు ప్రయాణీకులు! కూర్చోవడానికంటూ ప్రత్యేకంగా ఏమీలేక నిలబడి ఉన్నారు.

*    *    *

కిశోర్ ఒకటో నెంబరు బస్సు దిగి అక్కడికి వచ్చేసరికి రామ్నగర్ వైపు బస్ వెళ్తూ కనిపించింది.

"ఏ బస్సండి, ఇప్పుడు వెళ్ళింది" అంతకు ముందే అక్కడ నిలబడివున్న ప్రయాణీకుణ్ణి అడిగాడు.

"వన్ థర్టీ నైనండి."

"అయ్యో. బాడ్లక్" తనలో అనుకున్నట్లుగానే పైకి అనేశాడు.

"రాంనగర్ కేనా వెళ్ళేది?" ఆ వ్యక్తి అడిగాడు.

"అవునండీ."- సమాధానమిచ్చాడు కిశోర్. అతనికెప్పుడు యింట్లో పడదామా అన్నంత తొందరగావుంది. అతను సంగీత్లో సినిమా చూసి వస్తున్నాడు తండ్రి అసలే చండ శాసనుడు. అతను ఆఫీసు నుంచి వచ్చేసరికి పిల్లలంతా యింట్లో వుండి తీరాలంటాడు. కనుక తను తొందరగా యిల్లు చేరితే తను సినిమా కెళ్ళిన విషయం ప్రస్తావనకు రాదు. లేకుంటే తండ్రితో యెన్నితిట్లు తినాలో. ఇంత వయసొచ్చాకకూడా తండ్రి అలా తిట్టడం తనకు బాగనిపించదు. కాని ఏం చేయగలడు. ఆయన నైజమేఅంత. దగ్గరేగా పదిహేను నిమిషాల్లో నడిచి వెళ్ళవచ్చు అనుకున్నాడు కాని బస్సులు బోల్డన్ని వున్నాయిగా అని మళ్ళీ తనలో తనే సర్ది చెప్పుకున్నాడు.

కిశోర్కు సమాధానం చెప్పిన వ్యక్తి సుందర్రావు— ప్రైవేటు కంపెనీలో గుమస్తా ఉద్యోగం.

"మీరెక్కడి దాకా" అడిగాడు కిశోర్ అతన్ని.

"వారాసిగుడా కండి" అన్నాడు సుందర్రావు.


"అయితే మీరు వన్థర్టీ నైన్లో వెళ్ళి ఎయిటీ ఫోర్ బస్సును క్యాచ్ చేయక పోయారా?"

బదులుగా నవ్వాడతను. "మీకింకా తెలియదా, ఎయిటీ ఫోర్ బస్సునెప్పుడో క్యాన్సిల్ చేశారు."

అప్పుడు జ్ఞాపకం వచ్చింది కిశోర్కు, ఈ మధ్యనే కొన్ని రూట్లలో అయిదు నిమిషాల కోమారు బస్ నడిచే విధానాన్ని ప్రవేశపెట్టి కొన్ని రూట్లలో బస్సులను క్యాన్సిల్ చేసింది ఆర్టీసీ.

"అవునండి- మరచిపోయాను" అన్నాడు కిశోర్.

"కాకులను కొట్టి గద్దలకు వేస్తారు చూడండి, అలా వుంటుంది మన ఆర్టీసీ పద్ధతి. ఏవో రూట్లలో బస్సులను పెంచామని మన రూట్లో బస్సులను తగ్గిం



చింది" అని అంటున్నాడే కాని సుందరరావు ఆలోచనంతా కొడుకు మీదే వుంది. ఉదయం వచ్చేప్పుడు వానికి నూట మూడు డిగ్రీల జ్వరం. తను ఆఫీసుకు వెళ్ళకూడదే అనుకున్నాడు కాని లీవ్ లేదు. వెళ్ళకపోతే జీతం తగ్గించి ఇస్తారు. జేబులో డబ్బులు కూడా లేవు. ఆఫీసులో ఎవరినన్నా అడిగి అప్పయినా తీసుకు రావాలి. లేకుంటే పిల్లవాని మందులకు కష్టం.

"ఆఫీసునుంచి తొందరగా రండి" బేలగా, అర్థించినట్లుగా అడిగిన శ్రీమతికి అలాగే అని వాగ్దానంఅయితే చేశాడుకాని, ఈరోజు ఏవో అర్జంటు పనులున్నందున మామూలుకంటె ఎక్కువ లేటయింది.

టైం చూసుకున్నాడు- ఏడయింది. ఏం చేయాలో అర్థం కాలేదతనికి. నడిచి వెళ్దామా అంటే గంట కంటె ఎక్కువ సేపే పడుతుంది. అనిశ్చితంగా అటూ, యిటూ తిరుగుతున్నాడు.

"వచ్చేది ఎనభై ఆరేనా బాబూ" అక్కడేవున్న మరో వ్యక్తి అడిగాడు.

"కాదండీ. ఆరు నెంబరు" ఖాళీగా వస్తున్న ఆరో నెంబరు బస్సును చూస్తూ చెప్పాడు సుందరరావు.

"ఈ ఎనభై ఆరు కేమయింది. వాటినెవడు కాల్చేయటం లేదుకద ! ఇక్కడ్నుంచి వెళ్తున్నాయి కాని తిరిగి రావడం లేదు" అతని చిరాకంతా మాటల్లో ధ్వనించింది.

"మీ రెక్కడి దాకా" అడిగాడు సుందరరావు.

"సీతాఫల్‌మండికి బాబూ. గంట సేపట్నుంచి చూస్తున్నా. ఒక్క బస్సూ రావటం లేదు."

అతని పేరు గురువులు. ఏదో ప్రభుత్వాఫీసులో అటెండరు. అతనికీ తొందరగానే వుంది. ఎప్పుడు ఇల్లు చేరుతానా అని కలవరపడుతున్నాడతను. అతనికి అనుక్షణం మూడు నెల్లనుంచి మంచాన పడి వున్న భార్య ముఖం, మూడు రోజుల్నుంచి తిండిలేని విధవకూతురు ముఖాలు కనిపిస్తున్నాయి,

చేతిలోని సంచివైపు ప్రేమగా చూసుకున్నాడు. దానిలో రెండు రోజులకు సరిపడే బియ్యమున్నవి. ఆఫీసులో ఏ బాబునడిగినా అయిదు రూపాయలన్నా బదులివ్వరే. అయినా వాళ్ళనని ఏం లాభం ? వాళ్ళే అప్పు చేస్తుంటారు. ఎంత వదనుకున్నా ఈ రోజు మునుస్వామి దగ్గర అప్పు తీసుకోక తప్పలేదు. వాడు పది రూపాయలిచ్చినట్లే యిస్తూ అప్పుడే వడ్డీ క్రింద ఒక రూపాయి తగ్గించి యిచ్చాడు.

"టైమెంతయింది బాబూ" ఆరాటంగా అడిగాడు.

"ఏడు దాటింది."

"అమ్మో. ప్చ్ ఎలా?!"

రాధకు ఒళ్ళు కంపరమెత్తుతుంది- తనకు కొంచెం దూరంలో నిలబడి అంటున్న వ్యక్తుల మాటలవల్ల! చూస్తేనే తెలుస్తుంది సినిమాలో విలన్ వేషాలకు తప్ప ఇంకెందుకూ పనికిరారని. అయినా ఒంటరిగా వున్న ఆడదానిని చూస్తే ప్రతి మగాడికీ తెగులే. ఆమె ఓ మందుల కంపెనీలో టైపిస్టు రాంనగర్ కమ్యూనిటీ హాల్ ప్రక్కనున్న సందులో ఇల్లు. నడిచి వెళ్లాలంటే భయం- ఈ వెధవలు వెనక బడతారని. రిక్షాలో, ఆటోలో వెళ్ళినా కష్టమే. ఏదో జనం ఎక్కువ వున్న బస్సుల్లో వెళ్తేనే కొంచెం రక్షణ. ఇంటి దగ్గర రిటైరయి, తన పెళ్ళి గురించి కించిత్తయినా ఆలోచించని తండ్రి వున్నాడు. పైగా ఇవ్వాళ ఇంత లేటైందే అని ఆరాలు తీస్తాడు. చదువు ఒంటబట్టక జులాయిగా తిరిగే తమ్ముడున్నాడు

నిజానికి రాధకిప్పుడు ఇంటి కెళ్ళాలని లేదు. కాని ఎక్కడి కెళ్ళాలో తెలియక ఇంటికే వెళ్తుంది. ఈ మగవాళ్ళ మధ్య నుంచి కొంచెం సేపయినా రిలీఫ్‌గా వుండటానికి ఇంటికి వెళ్తుందామె. ఇంటికెళ్ళినా ఏం విశ్రాంతి-వంట చేయాలి-తమ్ముడికి. తండ్రికి వడ్డించాలి!

ఇంకొక వ్యక్తి వున్నాడు. అతను ఫ్యాక్టరీ గోడకానుకుని నిశ్చింతగా నిలబడి వున్నాడు. అతనో బడిపంతులు. అతనెప్పుడు ఆ ఉద్యోగంలోంచి తీసేస్తారో అతనికే తెలియదు. అతని పేరు జయశంకర్ కాని అతడు చాలామందికి 'జ్వాల'గా తెలుసు. 'జ్వాల' అతని కలం పేరు.

అతనికేం తొందర లేదు. ఇంటి దగర అతనికోసం ఎదురుచూసే వారెవరూ లేరు. పెళ్ళి చేసుకోలేదు. ఇకముందు కూడా చేసుకోదలుచుకోలేదు. ఊళ్ళో వున్న తల్లిదండ్రులకు నెల నెలా కొంత డబ్బు పంపిస్తుంటాడు. అదొక్కటే అతని బాధ్యత.


అంతకుముందే ఓ కవి సమ్మేళనంలో పాల్గొని తిరిగి వస్తున్నాడు. ఏమాత్రం తొందరలేని అతనికీ నిలబడి విసుగొస్తూంది ఆర్టీసీ వారికి ఏదయినా దివ్యదృష్టి వుందేమో అనుకున్నాడు. ఎక్కడ జనం బస్సు కోసం నిరీక్షిస్తుంటారో ఆ రూట్లో బస్సులు సరిగ్గా రావు. లేకపోతే తను ఆరో నెంబరు కోసం నిలబడినప్పుడు ఒక్క బస్సు రానిది ఈ రోజు ఎనభై ఆరు కొరకు నిలబడ్డప్పుడు వరుసగా ఆరు నెంబర్లు వెళ్ళడమేంటి ?

ఇంకా చాలా మంది ఆ స్టాపులో వున్నారు. కాని బస్సు రాలేదు. చార్మినార్ చౌరస్తా దగ్గర బస్ లైట్లు కనిపిస్తున్నప్పటి నుంచి ఆశగా అటువైపు చూస్తూ వుండటం, దగ్గరికి రాగానే నిరాశగా నిట్టూర్పు విడవడం- ఇంతే!

*  *  *

కిశోర్‌కు ఎందుకో ఆవేశం ఉప్పెనలా ముంచుకు వస్తుంది. ఎవర్నయినా తన్నాలనిపిస్తుంది.

ప్చ్. నడిచి వెళ్ళి వుంటే ఇదివరకు



ఎప్పుడో ఇల్లు చేరేవాడు. వెంటనే తండ్రి భయంకర రూపం స్ఫురణకొచ్చి భయమనిపిస్తుంది.

మనసంతా అనిశ్చితంగా, అస్తవ్యస్తంగా తయారయింది. సరిగ్గా ఇంకో రెండు బస్సులు చూసి నడుద్దామనుకున్నాడు కిశోర్.

సుందర్రావుకు తన మీద తనకే కోపం వస్తుంది. ఈ వెధవ బస్సును నమ్ముకున్న తన గుమాస్తా జీవితం మీద—తను బ్రతకడానికే కష్టమవుతున్న సమయంలో పెళ్ళి చేసుకున్న తన వయసు కోరిక మీద—

ఏమిటో —

ఏమో—

ఛీ వెధవ బస్సులు, వెధవన్నర బ్రతుకు.

ఇంటి దగ్గర పిల్లాడికేమయిందో.

ఎందుకో ఆ క్షణంలో ఎప్పుడూ రాని కొడుకుమీద కూడా కోపం వచ్చింది. వెధవకు ఈనాడే జ్వరం రావాలా? ఛీఛీ!

అయ్యో ఎలా వుందో వాడికి- మళ్ళీ అప్పుడే ఆదుర్దా. భార్య ఎంత కంగారు పడుతుందో— ఈ ఒక్క బస్సు చూసి వెళ్ళాలి.

ఇక ఈ బస్సు కొరకు చూసి లాభం లేదు — ఎలాగయినా వెళ్ళాలి.

గురువులు అలిసిపోయాడు. గవర్నమెంటును, ఆర్టీసీ వారిని తనకు తెలిసిన తిట్లన్నీ తిట్టి అలిసిపోయాడు.

ఆ తరువాత ఏం చేయాలో అర్థంకాక అలాగే నేలపై కూలబడిపోయాడు. అయినా కూర్చోబుద్ధి కావడంలేదు.

ఏదో తెలీని అస్థిమితం!

ఎంతో అశక్తత !!

జీవితంమీదే విరక్తి !!!

ప్రపంచంలోని శూన్యమంతా తనలోనే వున్నట్లుగా అనుభూతి చెందాడా సమయంలో.

నడిచి వెళ్ళలేదు. రిక్షాలో వెళ్తే మళ్ళీ ఎల్లుండి వస్తులే. దైన్యమైన భార్య ముఖం —

బేలగా వున్న కూతురి ముఖం—

తరువాత తన అసమర్థత వికృత రూపం !

రాధకూ కోపం వస్తుంది. ఉద్యోగం చేయవలసివచ్చిన తన పరిస్థితుల మీద. తనకింకా పెళ్ళిచేయని తండ్రి మీద. కొంచెం దూరంలో నిలబడి తనను ఎగతాళి చేస్తున్న గూండాలమీద. అంతెందుకు ఈ మగజాతి మీదనే అసహ్యం కలుగుతుంది

ఇరవై అయిదేళ్ళ యౌవనం వెక్కిరిస్తుంది.

ఇంకా ఈ కన్నెచెరలో ఎన్నాళ్ళో!!


# జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



## జలుబును పోగొట్టుకోవచ్చు

ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తలభారం, గొంతు నొప్పి, గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

## జలుబు మందుతో వాటిని ఎదుర్కోండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్లు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి.

## కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.



# కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC 44.222

# మల్లెపందిరి

## నిద్రా వివశుడు

షిఫ్ట్‌ల ప్రకారం వాచ్ మెన్ పనిచేస్తూంటారు. ఒకడు తన డ్యూటీ ముగించుకుని మరొకడికి అప్పచెప్పి పోవాలి. ఆ ముగించడం మరీ అపరాత్రిలో కావడంవల్ల యిలాటి పరిస్థితి కనపడుతుంది.

ప్రహరక మపనీయ స్వం నిద్రాసతో చైచః
ప్రతి పద ముపహూతః కేనచి జ్జాగృహీతి।
ముహురవిశదవర్ణాం నిద్రయా సూన్య సూన్యాం
దదదపి గిరమంత ర్బుధ్యతే నో మనుష్యః॥



జాము జాముకీ డ్యూటీలు మారే ఈ వాచ్‌మన్‌లు అక్కడే తమ డ్యూటీ వేళ అయేవరకూ నిద్రపోతారు.

ఒక సెంట్రీ తన పహరా డ్యూటీని జాముపాటూ చేసి నిద్ర పోవాలని, గట్టిగా మళ్ళీ మళ్ళీ పిలిచాడు డ్యూటీ చెయ్యవలసిన రెండోవాణ్ని. అయితే రెండో వాడికి కొంత మెళకువ వచ్చింది. అయినా నిద్ర మగత వదలడం లేదు. ఏదో జవాబు చెబుతున్నాడు. అది గొంతులోనే అస్పష్టంగా ఉండ పోతోంది వాడు లేవడంలేను

నిద్రలాంటి మత్తులోపడి వున్న మనుష్యుడు కూడాతనవిద్యుక్త ధర్మం నెరవేర్చడానికి లేవడు.

—సౌభరి

ఈ బస్ స్టాండులలో వెకిలిమాటల తూట్లతో బాధపడుతూ ఇంకెన్నాళ్ళో—

అసలు తన జీవితానికి అర్థమేమిటి?

ఉదయం లేవడం, వండి తండ్రికి పెట్టి తనింత తినడం, నలుగుతూ బస్సెక్కడం ఉద్యోగులందరి ఎక్స్‌రే చూపుల నెదుర్కోవడం, మళ్ళీ బస్ కొరకు నిరీక్షించి అలిసిపోవడం, ఇంటికెళ్ళడం, వండుకొనడం తినడం- ఇంతేనా, జీవితమంతా ఇంతేనా?

చేతులలో వున్న వ్యానిటీ బ్యాగు సైతం బరువనిపిస్తుంది.

ఈ జనారణ్యంలో తాను ఏకాకి అయినట్లుగా అనుభూతి చెందసాగింది.

విప్లవకవి జయశంకర్‌కు నీరసం ముంచుకొస్తుంది. ఎంతసేపని నిలుచో గలడు.

దరిదాపుల్లో కూర్చోదగ్గ ప్రదేశమేమీ కనిపించలేదు.

ఫుట్‌పాత్ మీద కూర్చోవాలంటే—

ఛీ. ఎంతకు దిగజారాను,

ఫుట్‌పాత్ మీది కంకరరాయిని కాలితో తన్నుతూ కొంతసేపు—

ప్రక్కనున్న చిన్నిచెట్టు ఆకులు చూస్తూ మరికొంతసేపు—

అసిటిక్ యాసిడ్ ప్లాంట్‌కేసి చూస్తూ ఇంతసేపు—

మరి ఎంతసేపు ఇలా—

కళ్ళు పొడుచుకొని— కళ్ళల్లో దుమ్ము కొడ్తూ వెళ్ళిపోయే బస్సులవంక ఆశగా చూస్తూ గడపడం.

*    *    *

వచ్చే బస్సు కొరకు ఆశగా చూస్తున్నాడు సుందర్రావు. వస్తుంది బస్సు. చండ ప్రచండ వేగంతో. క్రిక్కిరిసిన ప్రయాణీకులతో వస్తుంది బస్సు. దగ్గరికి వచ్చింది-నేమ్ బోర్డు దగ్గర లైటు లేదు- నెంబరు తెలియడంలేదు. మలుపు తిరుగుతుందా, నేరుగా వెళ్ళిపోతుందా అని ఎదురు చూస్తున్నాడు.

ఆశ నిరాశే అయింది. బస్సు నేరుగానే విద్యానగర్‌వైపు వెళ్ళిపోయింది. ఇక ఆలస్యం చేయదలుచుకోలేదు. వెనుకనే వస్తున్న ఆటోను పిలిచాడు. వారాసిగుడా అని చెప్పి ఎక్కికూర్చున్నాడు. కొంత దూరం వెళ్ళాక జ్ఞాపకం వచ్చింది. తొందరలో తను తోటి ప్రయాణీకుల్ని మరచిపోయిన సంగతి. తనెలాగూ ఇదే రూటులో వస్తున్నాడు కదా. రాంనగర్‌కు వెళ్ళే ఆ అబ్బాయికి. సీతాఫల్‌మండికి వెళ్ళే ఆ ముసలాయనకు లిఫ్ట్ ఇవ్వాల్సింది

చెడిపోయిన మనసు మరింత పాడయిపోయింది. తనకు నిజానికి ఆటోలో వెళ్ళే తాహతు లేదు అయినా వెళ్తున్నాడు. ఈ పని ముందే చేసుంటే- ఎప్పుడో ఇల్లు చేరుండేవాడు డబ్బు ఖర్చవుతుంది.

కాలం వ్యర్థమయింది.

లేచి ఎవరి ముఖం చూశానో!! ఛీ, ఛీ—

ఒక బస్సు వెళ్ళిపోయింది. రెండో బస్సు కూడా దాటిపోయింది. ధూ— అనుకొని నడక సాగించాడు కిశోర్. ఆటోలో వెళ్ళినతన్ని లిఫ్ట్ అడగకపోయినందుకు తనలో తనే బాధపడుతూ అడుగులేస్తున్నాడు.

పది నిమిషాల్లో నడిచివెళ్ళే పనికి తను గంటన్నర కాలం వ్యర్థం చేశాడు.

సినిమా చూసిన ఆనందమంతా ఆవిరయింది. నాన్న ఏమంటాడో?! గుండెలు గుబగుబలాడినవి. తొందరగా అడుగులేస్తున్నాడు.

ఇంకో రెండు మూడు నిమిషాలకు బస్సు వచ్చింది. కిటకిటలాడుతున్న జనంతో మలుపు తిరుగుతుండటంతోనే గురువులు లేచాడు.

"ఎనభై ఆరేనా బాబూ" అడిగాడు తన ప్రక్కనుంచి పరిగెత్తుతున్న జయశంకర్‌ను.

"అవును."

గురువులు, జయశంకర్, రాధ, రాధ వెంటవున్న గూండాల్లాంటి వీరులు అంతా బస్సుకేసి పరిగెత్తారు. బస్సు ఆగనేలేదు. ఏ మాత్రం వేగం తగ్గనీయకుండా డ్రైవరు ప్రయత్నిస్తున్నాడు. కాని మలుపులో స్లో చేయవలసివచ్చింది.

ఎవరో ముందునుంచి ఎక్కబోవ

డంతో కండక్టరు డ్రైవరు ఎక్కనీయలేదు. కాని రాధ ననుసరించిన గూండాలు వెళ్ళి ఎక్కితే ఏమనలేదు.

అందరూ వెనక నుంచి ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. పుట్ బోర్డుపై కాలు పెట్టే సందులేదు. "వెనుక ఇంకో బస్సు వస్తుంది" బస్సులో నుంచి ఎవరో అంటున్నారు. కాని వాళ్ళకు తెలుసు ఎక్కేవారి ఆరాటం.

గురువులు ఈ బస్సును వదిలిపెట్టదలుచుకోలేదు. ఈ బస్సు పోతే మరెప్పుడో !! ఎలాగో పుట్ బోర్డు దగ్గరున్న ఇనుప రాడ్ను చేతితో పట్టుకొని బస్సు వెనుక శక్తికొద్దీ పరుగుదీస్తున్నాడు - ఎగిరి పుట్ బోర్డుపై కాలు పెట్ట




MCA/PDC/62/Tel R

తారల ఫొటోలు

శ్రీదేవి.., జయసుధ.., జయప్రద.., జయమాలిని, సుజాత.., మాధవి.., ప్రభ.., కవిత.., ఎయన్నార్, ఎన్టీఆర్.., శోభన్‌బాబు.., కృష్ణ.., కృష్ణంరాజు, మోహన్‌బాబు.., కమలహాసన్.. చిరంజీవి!
వీరిలో ఎవరి ఫొటో కావాలన్నా ఫొటోకి 3 రూ॥లు. ఎం.ఓ. చేయాలి....! ఫొటోలతో పాటు సినీతారల అడ్రసులున్న పుస్తకం కూడా పంపబడును!

ఎవరి ఫొటో కావాలో వ్రాయడం మరువకండి!

వై.కె.మూర్తి.
దాసరివారి వీధి * విజయవాడ-2.

లైసెన్సు అవసరం లేదు

ఆధునిక పద్ధతులతో పటిష్టమైన ఇనుముతో తయారుచేయబడిన ఎక్స్‌పోర్టు క్వాలిటీ 6 షాట్ ఆటోమేటిక్ పిస్టల్. పిడుగులాంటి శబ్దముతో భయంకరమైన మంటనిచ్చును. క్రూరమృగములు, దొంగలు మరియు ప్రమాదముల నుండి రక్షించును. మీరు 6 షాట్లు ఒక దాని వెంట ఒకటి వరుసగా కాల్చవచ్చును.




ధర రూ. 66-50 మాత్రమే. లెదర్ కేసు మరియు 100 బుల్లెట్లు ఉచితం. అదనపు బుల్లెట్లు 100కి రూ. 5/- పోస్టేజి రూ. 8-50

VIJAY AGENCY (A-8)
CHHAPATI. ALIGARH



నూతన యవ్వనం పొందండి. సంతానవంతులు కండి! చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి. హస్తప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్కలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టు ద్వారా చికిత్స కలదు. ప్రతి ఆదివారము భీమవరం షణ్ముఖ లాడ్జి నందు ఉ. 9 నుండి సా. 6-30 వరకు క్యాంపు కలదు.

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేద భిషక్,
సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్టు,
పార్కురోడ్డు, గుడివాడ-521301
ఫోన్స్: 522 & 540

డానికి ప్రయత్నిస్తున్నాడు. "వద్దు, వద్దు. క్రింద పడతావ్" అంటున్నారు బస్సులోనివారు.

అప్పుడు గురువులికి ఇంకోచేతి సంచిలోని బియ్యం ఎలాగయినా ఇంటికి తొందరగా చేర్చాలనే ఉద్దేశం వుంది. అందుకే ఒక్క ఎగురున ఎగిరి కాలును పుట్‌బోర్డుపై పెట్టబోయాడు కాని- జారింది. అందరూ అరిచారు. బస్సు ఆగలేదు. తాను తలక్రిందులవడమే కాక, తనమీది నుంచి ఏదో బరువుది దొర్లిపోవడం చూచాయగా గుర్తుంది.

రాధ పరిగెత్తలేక అక్కడే ఆగిపోయింది. జయశంకర్‌కు తెలుసు తనకా బస్సు అందదని.

* * *

సరిగ్గా ఫర్లాంగు దూరం నడిచాడు కిశోర్ అప్పటికి. ఎందుకో వెనక్కి తిరిగి చూశాడు. బస్సు మలుపు తిరుగుతూ కనిపించింది.

చటుక్కున ఆగిపోయాడు. వెనుక స్టేజి ఎంత దూరం వుందో తన ముందు స్టేజి కూడా అంతే దూరం వుంది. ఎటూ వెళ్ళలేడు. అయినా ప్రయత్నిదాం అనుకొని ముందు స్టేజీ వైపు పరుగుతీశాడు.

బస్సు అతన్ని దాటి వెళ్ళి ముందు ఆగింది. కిశోర్ తన శక్తి కొద్దీ పరిగెత్తుతున్నాడు. ఇంకో అరనిమిషం అయితే బస్సు అంది వుండేదే- తను సమీపిస్తుండేసరికి బస్సు కదిలేసరికి ఎక్కడలేని కోపం వచ్చింది కిశోర్‌కు. ఎంత కోపం వచ్చిందంటే తనేం చేస్తున్నాడో మరచిపోయాడు. క్రిందికి వంగేసరికి పిడికిలికి నిండైన రాయి అందింది.

ఆవేశంగా, బలంగా. ఆలోచనా రహితంగా, పిచ్చిగా బస్సుకేసి విసిరాడు. అద్దం "పెళ పెళ" శబ్దం చేసింది. డ్రైవరు బ్రేకు వేశాడు. ముందు ఎంట్రన్సు దగ్గర స్టయిలుగా నిలబడి వున్న వీరులు గబగబా దిగి వచ్చారు. వారికి ఇతరులపై తమ ప్రావీణ్యం చూపాలంటే కూడా చాలా సరదా.

"మారో" అని బస్సులోంచి కూడా ఎవరో అరిచారు. అంతే. కిశోర్ బాధగా అరుస్తూ నాలుగయిదుసార్లు ఎగిరి రోడ్డు పక్కనున్న దుమ్ములో పడ్డాడు. వీరులు మళ్ళీ స్టయిలుగా ముందు ఎంట్రన్సు ఫుట్‌బోర్డు ఎక్కారు. బస్సు గర్వంగా కదిలింది.

రోడ్డు ప్రక్కనే వున్న ఇంటిముందు దిగి ఆటోకు డబ్బులిస్తున్నాడో. ఏదో ప్రక్క నుంచి బస్సు దూసుకుపోవడం చూసిన సుందర్రావుకు కడుపు మండింది. వ్వ్, మూడు రూపాయలు!

గంటన్నర ఎదురు చూసినవాడు ఇంకో రెండు నిమిషాలుంటే బస్సు ఎక్కి వచ్చేవాడు.

తలుపు తట్టిన అర నిమిషానికి భార్య తలుపు తీస్తే అరగంట సేపటికి తీసినట్లనిపించింది. కోపంగా, చిరాకుగా ఇంట్లోకి అడుగిడుతుండగానే-

"ఏమండీ ఇంతాలస్యం అయిం...." భార్య మాటలు పూర్తి చేయనే లేదు. చెంప ఛెళ్ళుమంది. ఆమె మొదట అదిరిపడి తరువాత అర్థంకానట్లు అమాయకంగానూ, బిత్తరపోయినట్లుగానూ చూసింది.

భార్య తెల్లని బుగ్గలపై ఎర్రగా పడిన తన చేతి గుర్తును చూసేసరికి – సరిగ్గా అప్పుడే గుమాస్తా సుందర్రావుకు కోపమంతా దిగిపోయినట్లుగా అనిపించింది.

గురువులి చేతి సంచిలోని బియ్యం అతని రక్తంతో కలిసి రోడ్డు నిండా చెల్లాచెదరయినవి. ఆ బియ్యం కోసం ఎదురు చూస్తూ....పూరిగుడిసెలోని రోగిష్టి భార్య. విధవ కూతురూను.

రాధ నిర్లిప్తంగా, నిస్సహాయంగా మళ్ళీ బస్ స్టాండ్‌కు తిరిగొచ్చి, చూసిన గురువులి ఆకారం కడుపులో త్రిప్పుతుండగా, ప్రక్కవారి సూటీ పోటీ మాటలను భరిస్తూ, తను ఇంకో బస్సు కోసం ఎదురు చూస్తున్నానన్న విషయం కూడా మరచిపోయి అలాగే నిలబడిపోయింది. ఆమె అసలు ఇల్లు చేరుతుందా?

గురువుల్ని అందరు జారుకున్నా జయశంకర్ మనసు అందుకు ఒప్పుకోలేదు. వెంటనే ఆటోలో వేసుకొని కోరంటి హాస్పిటల్‌కు తీసికెళ్ళాడు కాని, లాభం లేకపోయింది. గురువులు ఈ బాదరబందీల నుంచి శాశ్వతంగా విముక్తి పొందాడు. అతడు తన రోగిష్టి భార్యకోసం మందులు తేనవసరం లేదు. విధవ కూతురు జీవితం గురించి బాధపడనవసరం లేదు.

రిక్షాలో ఇల్లు చేరిన జయశంకర్ మనసంతా వికలమయింది. రూంలో కరెంటు లేదు. వండుకొని తినాలనిపించడం లేదు కూడా. పదే పదే గురువులి శవం కళ్ళ ముందు కనిపిస్తోంది. నిద్ర రావడంలేదు. అసలు పడుకోవాలనిపించడం లేదు.

కొవ్వొత్తిని వెలిగించుకొని, కాగితాలు తీసుకొని ఏకదీక్షగా రాయడం మొదలు పెట్టాడు. అలా రాస్తూ తన రచనవల్ల ఏదో మారబోతున్న మరో లోకాన్ని ఊహించుకొంటున్నాడు విప్లవ కవి జయశంకర్ - ఉరఫ్ 'జ్వాల'.